సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 17 । డిసెంబర్ । 2024



అమరవీరుల స్థూపం వద్ద మౌనం పాటిస్తున్న సైనికులు, గౌరవ వందనం చేస్తున్న వైస్ అడ్మిరల్ సమీర్‌సక్సేనా, కలెక్టర్ హరేందిర ప్రసాద్

సైనికుల త్యాగాలు చిరస్మరణీయం

ఏయూ క్యాంపస్: తూర్పు నావికాదళం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం బీచ్‌రోడ్డులోని విక్టరీ ఎట్ సీ వద్ద విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. 1971లో పాక్‌తో జరిగిన యుద్ధంలో భారత సైనికుల వీరోచిత పోరాటం, త్యాగాలను స్మరించుకున్నారు. అమరవీరుల స్మారక స్థూపం వద్ద తూర్పు నావికాదళం చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా పుష్పాలను ఉంచి గౌరవ వందనం చేశారు. భారత సైనికుల త్యాగాలను గౌరవిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, విశ్రాంత వైస్ అడ్మిరల్ వి.కె.నంబ్లా, బ్రిగేడియల్ జయంత్ కుమార్‌బారువా, వింగ్ కమాండర్ పి.శ్యామ్ కుమార్, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్, వెటరన్ సెయిలర్స్ ఫోరం గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సింహగిరిపై మోగిన నెలగంట



నెల గంట మోగిస్తున్న పురోహిత్ అలంకారి

సింహాచలం: ధనుర్మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని సింహగిరిపై నెలగంట ఉత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. నెలరోజులపాటు జరిగే ధనుర్మాస పూజలను తెల్లవారుజామున 3 గంటలకు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను ఆస్థాన మండపంలో వేదికపై కొలువుంచారు. ధనుర్మాస ప్రారంభ నివేదనం, తిరుప్పావై సేవాకాలం, ధను సంక్రమణ ప్రవేశ పూజలు చేశారు. గోదాదేవిని పల్లకిలో అధిష్ఠింపజేసి, ఆలయ బేడామండపంలో తిరువీధి నిర్వహించారు. ఆలయ రాజగోపురంలో ఉదయం 6.35కు నెలగంటను శాస్త్రోక్తంగా మోగించారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు ప్రాంతీయ రెవెన్యూ సదస్సు



మహారాణిపేట: ఉత్తరాంధ్ర జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఆర్డీవోలతో మంగళవారం ప్రాంతీయ రెవెన్యూ సదస్సు జరగనుంది. కలెక్టరేట్‌లో జరిగే ఈ సదస్సులో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తోపాటు రెవెన్యూశాఖ ఉన్నతాధికారులు పాల్గొంటారు. పీజీఆర్ఎస్, ఫ్రీ హోల్డ్, నీటి పన్ను, ప్రభుత్వ భూముల సంరక్షణ, గృహ నిర్మాణ స్థలాలు, రీసర్వే, గ్రామ సభలో ప్రస్తావనకు వచ్చిన రెవెన్యూ అంశాలు, సర్వే రాళ్లపై పేర్ల తొలగింపు తదితర అంశాలపై సుదీర్ఘంగా సమీక్షిస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు స్థానిక ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహిస్తారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(రెవెన్యూ) ఆర్.పి.సిసోడియా, భూ పరిపాలన విభాగం చీఫ్ కమిషనర్ జి.జయలక్ష్మి, భూ పరిపాలన విభాగం అదనపు చీఫ్ కమిషనర్ ఎస్.ప్రభాకరరెడ్డి తదితరులు హాజరవుతారు.

పలు విమానాలు ఆలస్యం



గోపాలపట్నం: పొగమంచు కారణంగా వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో పలు విమానాలు విశాఖ విమానాశ్రయానికి ఆలస్యంగా వచ్చాయి. హైదరాబాద్ నుంచి విశాఖకు ఉదయం 7 గంటలకు రావాల్సిన ఇండిగో విమానం 47 నిమిషాలు ఆస్యంగా వచ్చింది. చెన్నై నుంచి విశాఖకు ఉదయం 7.45 గంటలకు రావాల్సిన ఇండిగో విమానం ఉదయం 8.27 గంటలకు వచ్చింది. అలాగే బెంగళూరు నుంచి విశాఖకు ఉదయం 7.10 గంటలకు రావాల్సిన ఇండిగో విమానం ఉదయం 9 గంటలకు వచ్చినట్లు ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు.

పలు రైళ్ల దారి మళ్లింపు



తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే, గుంతకల్ డివిజన్ పరిధిలో ఆధునికీకరణ పనుల నిమిత్తం నంద్యాల-డోన్-అనంతపురంల మీదుగా నడిచే పలు రైళ్ల దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఈ నెల 20న పూరీ-యశ్వంత్‌పూర్(22883) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, 21న యశ్వంత్‌పూర్-పూరీ(22884) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, 25న హౌరా-యశ్వంత్‌పూర్(22831) ఎక్స్‌ప్రెస్, 20న యశ్వంత్‌పూర్-హౌరా(22832) ఎక్స్‌ప్రెస్, 21న భువనేశ్వర్-యశ్వంత్‌పూర్(02811) ఎక్స్‌ప్రెస్, 23న యశ్వంత్‌పూర్-భువనేశ్వర్(02812) ఎక్స్‌ప్రెస్‌లు మళ్లించిన మార్గంలో వయా నంద్యాల-ఎర్రగుంట్ల-గుత్తి-అనంతపురం స్టేషన్‌ల మీదుగా నడుస్తాయి.

టన్నుకు రూ.2 వేలు!

రేషన్ బియ్యం నిఘా అధికారుల స్పెషల్ ట్యాక్స్

రేషన్ బియ్యాన్ని ప్రభుత్వ పెద్దలు గద్దల్లా బొక్కేస్తుంటే.. నిఘా అధికారుల బృందం అదే బాటలో పయనిస్తోంది. అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం పట్టుకునేందుకు ఏర్పాటు చేసిన ఈ బృందం వసూళ్లకు పాల్పడి లోడింగ్‌కు అనుమతులిస్తోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. టన్నుకు రూ.2 వేలు చొప్పున తీసుకొని అక్రమ రవాణాకు సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. కంటైనర్ టెర్మినల్‌లో ఉన్న అధికార పార్టీ సామాజికవర్గానికి చెందిన వ్యాపారి ఫ్రైట్ స్టేషన్ నుంచి నిత్యం జరుగుతున్న తంతే అయినా.. ఉన్నతాధికారులు మాత్రం తమకేం సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు.



- పీడీఎస్ బియ్యం అక్రమార్కులతో చేతులు కలిపిన అధికారులు
- డబ్బులిస్తే లోడింగ్‌కి అనుమతులు
- ఆ వ్యాపారి కంటైనర్ ఫ్రైట్ స్టేషన్‌కి గుట్టుచప్పుడు కాకుండా తరలింపు

సాక్షి, విశాఖపట్నం: పేదల కోసం అందిస్తున్న పీడీఎస్ బియ్యం విదేశాలకు అక్రమంగా తరలించేస్తున్నారనీ.. వాటిని తాము పట్టుకున్నామంటూ కూటమి ప్రభుత్వం కలరింగ్ ఇస్తోంది. తూతూ మంత్రంగా దాడులు చేసి క్వింటాళ్లలో బియ్యాన్ని పట్టుకొని.. వందల టన్నుల గల బియ్యం కంటైనర్లను మాత్రం హాయిగా పంపించేస్తోంది. పైగా తామే ఈ వ్యవస్థని కాపాడుతున్నామంటూ ప్రభుత్వ పెద్దలంతా బాకాలు కొడుతున్నారు. ఇటీవల విశాఖపట్నంలో పర్యటించి.. 483 టన్నులు బియ్యాన్ని సీజ్ చేసినట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. కానీ.. పక్కనే ఉన్న తమ అనుయాయ వ్యాపారి వేర్ హౌస్‌లపై కన్నెత్తి చూడకుండా అటెన్షన్ మొత్తం.. పోర్టు అనుబంధ విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్(వీసీటీపీఎల్)కి చెందిన కంటైనర్ ఫ్రైట్ స్టేషన్(సీఎఫ్ఎస్)పై ఉండేటట్లుగా చేసేశారు. దీంతో సదరు సామాజికవర్గానికి చెందిన వ్యాపారి సీఎఫ్ఎస్‌ల నుంచి దర్జాగా పీడీఎస్ బియ్యం విదేశాలకు తరలిపోతున్నాయి.



విశాఖలోని కంటైనర్ ఫ్రైట్ స్టేషన్లు

నిఘా బృందమా..? వసూళ్ల బృందమా.?

మంత్రి పర్యటన అనంతరం పోర్టు నుంచి పేదల బియ్యం వెళ్లకుండా నిఘా పటిష్టం చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం సీఎఫ్ఎస్‌లకు వచ్చే కార్గోని తనిఖీ చేసేందుకు అధికారులతో కూడిన ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడే అసలు కథ మొదలైంది. బియ్యం పట్టుకోవడం అటుంచితే.. సదరు బృందానికి మాత్రం లాభాలు తెచ్చిపెడుతోంది. 'పౌరసరఫరాల శాఖ అధికారుల బృందం నిరంతరం తనిఖీలు చేసి.. ఇక్కడికి వచ్చిన కార్గోలో పీడీఎస్ బియ్యం ఉంటే.. దాన్ని సీజ్ చేసి.. ప్రభుత్వానికి అప్పగించడంతో పాటు సదరు బియ్యాన్ని తీసుకొచ్చిన ఏజెన్సీపై 6ఏ కేసులు నమోదు చేయాలి.. బియ్యానికి సంబంధించిన పూర్తి డాక్యుమెంట్స్ ఇవ్వాలని గడువు విధించాలి'. కానీ.. ఇవేమీ చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొంతమంది అధికారులు టన్నుకు రూ.2 వేలు చొప్పున వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. వచ్చిన లోడ్‌లో ఎంత మేర పీడీఎస్ బియ్యం ఉన్నాయో గణించి.. దాని ప్రకారం వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. బేరసారాలు కుదిరిన తరువాత ఆ రేషన్ బియ్యానికి రెక్కలొస్తున్నాయి.

కంటైనర్ లోడ్‌కు రూ.50 వేలు.?

మొత్తంగా సీఎఫ్ఎస్ దగ్గరకి వస్తున్న రేషన్ బియ్యం నిఘా అధికారులకు పంట పండిస్తోంది. టీడీపీ సానుభూతిపరుడిగా వ్యవహరిస్తున్న సీఎఫ్ఎస్ యజమానికి చెందిన వేర్ హౌస్‌ల వైపుగా దారి మళ్లిస్తున్నారు. ఇలా వచ్చిన బియ్యాన్ని కంటైనర్లలో లోడ్ చేస్తున్నారు. ఒక్కో కంటైనర్‌కు రూ.50 వేల వరకూ వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల చైనాకు వెళ్లిన కార్గో షిప్‌లో 60 కంటైనర్ల పీడీఎస్ బియ్యాన్ని లోడ్ చేశారు. ఈ షిప్ ద్వారా నిఘా అధికారులకు దాదాపు రూ.30 లక్షల వరకు ముట్టినట్లు తెలుస్తోంది. ఇలా.. ఓవైపు ప్రభుత్వం అండతో.. మరో వైపు.. నిఘా అధికారుల సహకారంతో పేదల బియ్యం.. ఓ వ్యాపారి కనుసన్నల్లో దేశాలు తరలిపోతుంటే.. ఉన్నతాధికారులు మాత్రం.. ఒక్క బియ్యం గింజ కూడా బయటకు వెళ్లడం లేదని చెబుతుండటం కొసమెరుపు.

విశాఖ రూపురేఖలు మారేలా పనిచేయాలి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ హరేందిర ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్

మహారాణిపేట: రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన స్వర్ణాంధ్ర -2047 విజన్ ప్లాన్ ప్రాతిపదికగా ముందుకు సాగాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. విశాఖ రూపురేఖలు మార్చేలా ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించారు. ఈ నెల 11, 12వ తేదీల్లో విజయవాడలో జరిగిన రెండో విడత కలెక్టర్ల సదస్సు విశేషాలను సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో వివరించారు. రంగాల వారీగా వివిధ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యాటక రంగ అభివృద్ధికి పుష్కలమైన అవకాశాలు ఉన్నాయని, ఆ దిశగా కొత్త ప్రాజెక్టులు చేపట్టాలని, కొత్త హోటళ్లు, రిసార్టులు ఏర్పాటు చేసేందుకు సహకారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వీఎంఆర్డీఏ, జీవీఎంసీ పరిధిలో చేపట్టే ప్రాజెక్టులను వేగవంతం చేయాలన్నారు. రేషన్ సరకులను కూడా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి ఇవ్వాలన్నారు. ఉచిత ఇసుక విధానం పారదర్శకంగా అమలు కావాలని, మద్యం పాలసీకి అనుగుణంగా జిల్లాలో చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి మూడో శనివారం ఆయా కార్యాలయాల్లో పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని, పచ్చదనం పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎంఎస్ఎంఈ సర్వే పూర్తి స్థాయిలో చేయాలని,గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ పి. సంపత్ కుమార్, సీపీఓ శ్రీనివాసరావు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు

- ఆ రోజు ఉదయం 5 నుంచి 10.30 వరకే ఉత్తరద్వార దర్శనం
- వివిధ విభాగాల సమీక్షలో సింహాచలం ఈవో త్రినాథరావు



మాట్లాడుతున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: వచ్చేనెల 10న సింహగిరిపై ముక్కోటి ఏకాదశి ఉత్సవాన్ని అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీగా నిర్వహిస్తామని దేవస్థానం ఈవో వి.త్రినాథరావు అన్నారు. దేవస్థానం పరిపాలనా కార్యాలయంలో సోమవారం దేవస్థానం, పోలీస్, ఆర్టీసీ, వైద్య ఆరోగ్యం, ఫైర్ అధికారులతో ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ 45 వేల మందికి పైగా భక్తులు ఉత్తర ద్వార దర్శనానికి వచ్చే అవకాశం ఉందని, ఆ మేరకు క్యూలైన్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆలయ ఉత్తర రాజగోపురంలో ఉదయం 5 నుంచి 10.30 గంటల వరకే ఉత్తరద్వార దర్శనం లభిస్తుందన్నారు. 10.30 నుంచి 11.30 వరకు సింహగిరి మాడ వీధిలో స్వామికి తిరువీధి ఉంటుందన్నారు. రెగ్యులర్‌గా ఉండే ఉచిత దర్శనం, రూ.100, రూ.300 టికెట్లతో పాటు కేవలం ఉత్తర ద్వార దర్శనానికి రూ.500 టికెట్ యోచన చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ రోజు తెల్లవారుజాము 4 నుంచి ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. 9వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే భక్తులకు దర్శనాలు లభిస్తాయన్నారు. 10న నిత్యకల్యాణంతో పాటు అన్ని ఆర్జిత సేవలు రద్దు చేయనున్నట్లు పేర్కొన్నారు. సమీక్షలో గోపాలపట్నం సీఐలు జి.అప్పారావు, సీఐ శ్రీనివాసరావు, దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈవోలు ఆనంద్‌కుమార్, రమణమూర్తి, రాజేంద్రకుమార్, పిల్లా శ్రీనివాసరావు, అడవివరం ఆరోగ్యకేంద్రం డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ రామిరెడ్డి, సింహాచలం ఆర్టీసీ డిపో డిప్యూటీ సీటీవో జి.సత్యనారాయణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'పోర్టు దొంగల'పై సీపీ సీరియస్?

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, విశాఖపట్నం: పోర్టులో ఖనిజ చోరుల వ్యవహారంపై పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సీరియస్ అయ్యారు. 'పోర్టులో దొంగలు పడ్డారు' పేరుతో సాక్షిలో సోమవారం ప్రచురితమైన కథనంపై ఆరా తీశారు. ఇటీవల కొన్ని కంపెనీల ప్రతినిధులు ఈ ఖనిజాల దొంగతనాలపై ఫిర్యాదు చేయడానికి వెళ్లిన సమయంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేసి రహస్య విచారణకు ఆదేశించినట్లు తెలిసింది. అలాగే గతంలో వచ్చిన ఫిర్యాదుల సమయంలో అప్పటి అధికారులు, తీసుకున్న చర్యలపై కూడా విచారణ చేయాలని అధికారులకు చెప్పినట్లు సమాచారం. ఇప్పటికే పోలీస్ అధికారులు పలు కంపెనీల ప్రతినిధుల నుంచి సమాచారాన్ని సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. అలాగే కారు రిజిస్ట్రేషన్ నెంబర్ ఆధారంగా కూడా విచారణ చేపట్టారు. పూర్తి ఆధారాలతో త్వరలోనే సీపీకి నివేదిక అందించే అవకాశం ఉంది.

దివ్యాంగులకు ఉపకరణాలు

19 నుంచి గుర్తింపు శిబిరాలు

మహారాణిపేట: దివ్యాంగులు, వయోవృద్ధుల సహాయ ఉపకరణాల గుర్తింపు శిబిరాలను ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ తెలిపారు. ఈనెల 19న భీమిలి నియోజకవర్గంలో రెడ్డిపల్లి జెడ్పీ హైస్కూల్ ఆవరణలో, 20న విశాఖ సౌత్ నియోజకవర్గం పరిధిలో నీలమ్మ వేపచెట్టు వద్ద ఉన్న ఎంజీఎం హైస్కూల్‌లో, 21న విశాఖ వెస్ట్ నియోజకవర్గంలో క్వీన్ మేరీ హైస్కూల్ వద్ద ఈ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. వీల్ చైర్, చంక కర్రలు, కాలిపర్స్, స్మార్ట్ కేన్/చేతి కర్రలు, బ్రెయిలీ కిట్, స్మార్ట్ ఫోన్స్, శ్రవణ యంత్రాలు తదితర పరికరాలు అందజేస్తామన్నారు. హైదరాబాద్‌కు చెందిన అలిమ్-కో కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం ద్వారా పరికరాలను సరఫరా చేస్తుందన్నారు. శిబిరాలకు సదరం ధ్రువీకరణపత్రం, ఆధార్ కార్డు, రెండు పాస్ ఫొటోలు, యూడీఐడీ కార్డు జిరాక్స్ తీసుకొని రావాలన్నారు.

అర్జీదారులతో నేరుగా మాట్లాడాలి

- అధికారులకు కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశం
- పీజీఆర్ఎస్‌కు 213 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను 24 గంటల లోపు ఓపెన్ చేసి, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్వో భవానీ శంకర్, ఆర్డీవో శ్రీలేఖ, జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వర్మతో కలిసి కలెక్టర్ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మొత్తం 213 అర్జీలు స్వీకరించామని తెలిపారు. రెవెన్యూ శాఖకు 59, పోలీసు శాఖకు 16, జీవీఎంసీకి సంబంధించి 64 అర్జీలు, ఇతర విభాగాలకు సంబంధించి 74 వినతులు వచ్చాయన్నారు. జిల్లా అధికారులు అర్జీదారులతో నేరుగా మాట్లాడి, సమస్యకు సరైన పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.

నిర్లక్ష్యానికి తావులేదు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రారంభానికి ముందుగా అధికారులతో కలెక్టర్ హరేందిర ప్రసాద్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజలకు సేవ చేసేందుకు ఉన్నామనే విషయం అధికారులు అర్థం చేసుకోవాలన్నారు. అర్జీలు పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహించవద్దని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 117 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వాటిపై వెంటనే సంబంధిత స్టేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సత్వరమే పరిష్కరించాలని చెప్పారు.

దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేక కౌంటర్లు



వినతులు స్వీకరిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

డాబాగార్డెన్స్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఒక గోల్డెన్ డేగా జీవీఎంసీ పరిగణిస్తోందని కమిషనర్ సంపత్‌కుమార్ పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కమిషనర్ పాల్గొని నేరుగా వృద్ధులు, దివ్యాంగుల వద్దకు వెళ్లి వినతులు స్వీకరించారు.

జీవీఎంసీ పీజీఆర్ఎస్‌కు 94 వినతులు

జీవీఎంసీ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 94 వినతులు వచ్చాయని మేయర్ గొలగాని హరి వెంకట కుమారి పేర్కొన్నారు. ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి మేయర్ అర్జీలు స్వీకరించారు. మొత్తం 76 వినతులు అందగా వాటిలో జోన్-1 నుంచి 2, జోన్-2 నుంచి 11, జోన్-3 నుంచి 17, జోన్-4 నుంచి 4, జోన్-5 నుంచి 17, జోన్-6 నుంచి 13, జోన్-7 నుంచి ఒకటి, జోన్-8 నుంచి 16, జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సంబంధించి 13 ఫిర్యాదులు ఉన్నట్లు తెలిపారు. జీవీఎంసీ అడ్మినిస్ట్రేషన్ అండ్ అకౌంట్స్ విభాగానికి 4, రెవెన్యూ విభాగానికి 8, ప్రజారోగ్య విభాగానికి 3, అత్యధికంగా పట్టణ ప్రణాళికా విభాగానికి 55, ఇంజినీరింగ్ విభాగానికి 19, హార్టీకల్చర్ విభాగానికి ఒక ఫిర్యాదు అందగా యూసీడీ విభాగానికి 4 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ప్రధాన ఇంజినీరు శివప్రసాద రాజు, చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ సి.వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు 15 ఫిర్యాదులు

విశాఖ సిటీ: ప్రజాదర్బార్‌లో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, సంస్థ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి 15 ఫిర్యాదులు వచ్చాయి. బాధితుల సమస్యలను స్వయంగా తెలుసుకొని వాటిని సత్వరమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వేపగుంట నుంచి పినగాడి రహదారి విస్తరణకు సంబంధించి అభ్యంతరాలు తెలిపేందుకు భారీగా గ్రామస్తులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతులు భవానీ శంకర్, శిల్ప, వేణుగోపాల్, పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తికి ఐదేళ్ల జైలు

విశాఖ లీగల్ : కులం పేరుతో మహిళను దూషించి, మోసం చేసిన వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.2,06,000 జరిమానా విధిస్తూ నగరంలోని 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.సత్యదేవి సోమవారం తీర్పునిచ్చారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బీవీఆర్ మూర్తి అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు చింతాడ నారాయణస్వామి గాజువాక ప్రాంతంలోని ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్నాడు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ఓ మహిళ తన భూమి అమ్మడానికి నిర్ణయించుకుంది. 2017 మార్చిలో నారాయణస్వామి భూమిని కొనుగోలు చేసేందుకు సదరు మహిళతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈమేరకు అడ్వాన్స్‌గా రూ.1,10,000 భూయజమానికి అందజేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. కొద్ది రోజుల తరువాత మిగిలిన డబ్బులు కూడా ఇవ్వాలని సదరు మహిళ నారాయణస్వామిని కోరింది. ఆమెకు డబ్బులు ఇవ్వకపోగా కులం పేరుతో దూషించి మెడపై చేయి వేసి తోసివేశాడు. బాధితురాలు కింద పడిపోయింది. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎయిర్ పోర్టు పోలీసులు కేసు దర్యాప్తు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు. జరిమానా సొమ్ములో రూ.2 లక్షలు బాధితురాలకు ఇవ్వాలని న్యాయమూర్తి తీర్పులో స్పష్టం చేశారు.

పడమటి సంధ్యారాగం



ఏయూ క్యాంపస్: శీతాకాలం ఉషోదయాన సాగరతీరంలో నులివెచ్చని కిరణాలతో మనల్ని పలకరించే ఉదయ భానుడిని, సాయంసంధ్యలో ఈ రోజుకు సెలవంటూ లోకాన్ని తిమిరంలోకి నెట్టేసి కొండల మాటున కనుమరుగయ్యే అరుణ భాస్కరుడి అందాలను ఆస్వాదించాలే తప్ప.. వర్ణించతరమా? మనసునే కాన్వాసుగా.. కళ్లనే కుంచెగా మలచుకుని పదిలంగా నిక్షిప్తం చేసుకోవాల్సిందే. విశాఖ వాసులు కాస్త మనసుపెట్టాలే గానీ ప్రతి రోజూ వీటిని ఆస్వాదించొచ్చు. సోమవారం సాయంత్రం ఆర్కే బీచ్‌లో వద్ద ఆకాశంలో పసిమి వన్నెలో భానుడు కనువిందు చేశాడు. నేల ఈనిందా అన్నట్లున్న వాహనాలకు ముందుండి దారి చూపిస్తున్నట్లున్న ఈ సుందర దృశ్యాన్ని సాక్షి కెమెరామెన్ క్లిక్‌మనిపించారు.

-ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్

డియర్..డీర్




కంబాలకొండలో జింకలు సందడి చేశాయి. సందర్శకుల ముందు గంటల తరబడి సంచరించాయి. దీంతో పిల్లలే కాకుండా పెద్దలు కూడా వాటితో సెల్ఫీలు దిగడానికి పోటీ పడ్డారు.

-ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్



ఇక్కడిలా.. అక్కడలా





కార్మికుల నిత్యం బతుకు పోరాటం చేస్తున్నారు. పూట గడవడం కోసం ఎన్నో సాహసాలు చేస్తూ కష్టపడుతున్నారు. ఇటువంటి దృశ్యాలు సోమవారం నగరంలో దర్శనమిచ్చాయి. బీచ్ రోడ్డులో ఒక ప్రాంతంలో యంత్రం సహాయంతో సురక్షితంగా రంగులు వేస్తూ కనిపించారు. కొంత దూరంలోనే మరికొంత మంది ఎటువంటి భద్రత లేకుండా కర్రలతో నిర్మించిన పరంజిపై నిలబడి భవన నిర్మాణ పనులు చేస్తున్నారు. కార్మికుడికి కొంత యంత్ర సహాయం తోడైతే అతడికి భద్రత ఉంటుందనడానికి ఈ చిత్రాలే నిదర్శనం.

-ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్,విశాఖపట్నం

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన



విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

మద్దిలపాలెం: ఈనెల నుంచి పెంచిన విద్యుత్ చార్జీలను కూటమి ప్రభుత్వం రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్.శర్మ డిమాండ్ చేశారు. సోమవారం హెచ్‌బీ కాలనీ బస్ స్టాప్ వద్ద సీపీఎం15, 16వ వార్డు శాఖల ఆధ్వర్యంలో విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. అనంతరం విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ రెండేళ్ల క్రితం వాడిన విద్యుత్‌కు ఇప్పుడు ట్రూ అప్, ఎఫ్‌పీపీపీఏ పేరుతో కూటమి ప్రభుత్వం రూ.18 వేల కోట్లు భారం వేసిందన్నారు. ప్రజల ఆమోదం లేకుండా ఆదానీ లాభాలకోసం భారం మోపడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వి.కృష్ణారావు, ఎం.ప్రదీప్, జీవీఏ చలపతి, జి.ఎస్.రాజేశ్వరరావు, జీవీ రమణ, కె.కుమారి, షరీఫ్, బేగం తదితరులు పాల్గొన్నారు.

సంద్రానికి గుండె కోత



కోతకు గురైన విశాఖ తీరం (ఫైల్)



విక్టరీ ఎట్‌సీ ఎదురుగా కోతకు గురైన ప్రాంతం

- తరచూ కోతకు గురవుతున్న సముద్ర తీరం
- చర్యలపై దృష్టిసారించాల్సిందే..

ఏయూక్యాంపస్: సముద్ర తీరం తరచూ కోతకు గురవుతోంది. ఇది కాలానుగుణంగా జరిగే సహజ సిద్ధమైన ప్రక్రియ. అయితే ఇటీవల కాలంలో విశాఖ సముద్ర తీరంలో అధికంగా కోతకు గురవడం ఆందోళన పరుస్తోంది. దీనివల్ల సాగర తీరం స్వరూపం రోజురోజుకూ మారుతోంది. సముద్రంలో భాగమైన తీరప్రాంతాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనికి ప్రభుత్వాలు, యంత్రాంగం దృష్టి సారించాలి. సముద్రం ఆటుపోట్లకు నిత్యం గురవుతుంది. చాలా ప్రాంతాల్లో ప్రతీ 6 గంటలకు ఒకసారి ఆటుపోట్లు రావడం మనం గమనించవచ్చు. తక్కువగా ఆటుపోట్లు ఉన్నపుడు తీరం వెడల్పు పెరుగుతుంది. అధిక ఆటుపోట్లు ఉన్నప్పుడు తీరంలో వెడల్పు తగ్గడం జరుగుతుంది. పౌర్ణమి, అమావాస్య, రుతువులను సైతం అనుసరించి ఈ మార్పులు జరుగుతూ ఉంటాయి.

కోతకు కారణాలివే...

సముద్ర తీర ప్రాంతం తీవ్రస్థాయిలో కోతకు గురవుతోంది. ఉష్ణ మండల తుఫాన్లు, రుతుపవనాల సీజన్‌లో వచ్చే వరదలు, సముద్ర మట్టాల పెరుగుదల, పెరిగిన పోర్టులు, హార్బర్ల నిర్మాణం, మడ అడవుల నరికివేత, పరిశ్రమల కాలుష్యంతో సముద్ర జలాల ఆమ్లీకరణ వంటివి ఇందుకు కారణాలుగా చెప్పుకోవచ్చు. పరిశ్రమల కాలుష్యం తదితర కారణాలతో ఎక్కడికక్కడ తీరం కోసుకుపోతోంది.

కాలానుగుణంగా మార్పులు

వేసవిలో నీరు వేడెక్కుతుంది. దీని ఫలితంగా నీరు వ్యాకోచిస్తుంది. అదే సమయంలో మంచు కరిగి సముద్రంలో కలుస్తుంది. వీటి ఫలితంగా సముద్రం మట్టం పెరుగుతుంది. శీతాకాలంలో దీనికి వ్యతిరేకంగా సముద్ర మట్టం తగ్గుతుంది. విశాఖ సముద్ర మట్టంలో పెరుగుదల, తగ్గుదల 90 సెంటీమీటర్ల వరకు ఉంటుందని ఒక అంచనా. బంగాళాఖాతంలో ఈ మార్పు అధికంగా ఉంటుంది. అదే సమయంలో ఎపిసోడిక్‌గా సైక్లోన్‌లు, సునామీలు వచ్చిన సందర్భంలో కూడా కొంత మార్పులు జరుగుతాయి. ఇవన్నీ కాలానుగుణంగా జరిగే మార్పులు.

గ్లోబల్ వార్మింగ్ : దీర్ఘకాలంలో వచ్చే మార్పులను పరిశీలిస్తే గ్లోబల్ వార్మింగ్, హిమానీ నదులు కరిగిపోవడం, సముద్ర మట్టం పెరగడం జరుగుతోంది. సముద్రానికి అవసరమైన మెటీరియల్ ప్రధానంగా నేలనుంచి నదుల ద్వారా సముద్రానికి చేరుతుంది. ఇది తరచూ జరిగే ప్రక్రియ, ఇటీవల కాలంలో ఇది సరిపడినంతగా సముద్రాలలోకి చేరడం లేదు. ఈ సప్లయ్ చైన్‌లో అవాంతరాలు వస్తున్నాయి. ఇది దెబ్బతిన్న సమయంలో కూడా సముద్ర తీరం కోతకు లోనవుతుంది.

సహజసిద్ధంగా వదిలేయాలి

విశాఖ సముద్ర తీరాన్ని పరిశీలిస్తే, సముద్రం చుట్టూ కొండలు ఉన్నాయి. అర్ధచంద్రాకార బీచ్‌లు దీని ఫలితంగా ఏర్పడ్డాయి. వీటిని సహజంగా వదిలేయాలి. ఇక్కడ నిర్మాణాలు చేయడం, శాశ్వత కట్టడాలు ఏర్పాటు చేయడం ఎంతమాత్రం సరికాదు. అదే సమయంలో సముద్రానికి అడ్డుగా గోడ కట్టాలనుకోవడం, జియో ట్యూబ్‌లు ఏర్పాటు చేయడం మరింత నష్టాన్ని చేస్తాయి. ఇప్పటికే వీటిని పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసి ఆర్థికంగా, పర్యావరణ పరంగా తీవ్ర నష్టం చవిచూశాం.

శాశ్వత నిర్మాణాలు చేయరాదు

సముద్ర తీరం ఎప్పుడూ సముద్రంలో అంతర్భాగంగానే పరిగణించాలి. ఇది ఎంతమాత్రం భూభాగం కాదు. తీర ప్రాంతంలో చిన్నపాటి శాశ్వత నిర్మాణం చేపట్టినా అది తీరంపై ఎంతో ప్రభావం చూపుతుంది. ఇటీవల కాలంలో నదులపై కట్టడాలు పెరగడం వలన సెడిమెంట్ సముద్రంలోకి తగినంత రావడం లేదు. నీరు ఆనకట్టల వద్ద నిల్వ ఉండే సమయంలో అక్కడే సెడిమెంట్ కూడా నిలిచిపోతోంది. కృత్రిమంగా బీచ్‌ను పరిరక్షించడానికి డ్రెడ్జింగ్ చేస్తున్నారు. ఇవి భారీ ఖర్చుతో కూడుకున్నవి, శాశ్వత పరిష్కారాలు కనుక్కోవాలి.

–ఆచార్య కాకాని నాగేశ్వరరావు, గౌరవ ఆచార్యులు, జియో ఇంజనీరింగ్ విభాగం, ఏయూ



దశాబ్ద కాలంలో కురుసుర వద్ద కోతకు గురైన తీర ప్రాంతం

- కురుసుర సబ్‌మెరైన్ మ్యూజియం ఏర్పాటు చేయకముందు తీర ప్రాంతం విశాలంగా ఉండేది. తరువాత కోతకు గురవుతూ నేడు దాదాపుగా సబ్‌మెరైన్ మ్యూజియం గోడలను తాకుతూ కెరటాలు వస్తున్నాయి.
- ఇటీవల విశాఖ తీరానికి కొట్టుకు వచ్చిన 'ఎంవీ మా' విదేశీ నౌక తెన్నేటి పార్క్ సమీపంలో నిలిచిపోయింది. దీని వెనుక భాగంలో బీచ్ విశాలంగా మారడం కూడా గమనించవచ్చు. ఇవన్నీ సహజ సిద్ధంగా జరిగినవే కావడం విశేషం,

జపాన్ తరహాలో అభివృద్ధి చేయాలి



సముద్ర తీరంలో జపాన్ తరహాలో అభివృద్ధి చేస్తే తీర ప్రాంతాన్ని సంరక్షించడం సాధ్యపడుతుంది. జపాన్‌లోని కైకె బీచ్ ఆదర్శంగా నిలుస్తోంది. సముద్ర తీరం నుంచి కొద్ది దూరంలో ఒక ప్రత్యేకమైన విధానంలో రాళ్లను అడ్డంగా పేర్చుతారు. మధ్యలో కొంత ఖాళీ ఉంచి మరికొన్ని రాళ్లను పేర్చుతారు. ఈ విధానంలో చేయడం వలన సముద్ర తీరం కోతకు గురికాదు. అదే సమయంలో రెండు రాళ్ల గుట్టల మధ్య చిన్నపాటి నీరు చేరి ఆటలాడుకోవడానికి, ప్రజలు సేదతీరడానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ఇది ఎక్కువ లోతు ఉండకపోవడం, కెరటాలు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం లేపోవడంతో ప్రజలు సురక్షితంగా ఇక్కడ సరదాగా గడప వచ్చు. ఇటువంటి సముద్ర తీరాలు డానిష్ కోస్ట్‌లో, కర్ణాటకలోని మార్వంతే తీరంలో కూడా ఉన్నాయి.



నాడు

తెన్నేటిపార్క్ వద్ద షిప్ వచ్చినపుడు



నేడు

తెన్నేటిపార్క్ వద్ద ప్రస్తుత పరిస్థితులు

ఎమ్మెల్సీ ఓట్ల దరఖాస్తుల పరిశీలన

మహారాణిపేట : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు దరఖాస్తుల పరిశీలన శరవేగంగా సాగుతోంది. జిల్లా యంత్రాంగా ప్రత్యేక బృందాలను నియమించింది. జిల్లాల వారీగా నియమించిన ఈ బృందాలు ఓటర్లు నమోదు దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. ఈనెల 30న తుది ఓటర్లు జాబితాను ప్రకటించనున్నారు. గత నెల 23న ముసాయిదా జాబితా ప్రకటించిన విషయం తెలిసిందే. మొత్తం ఓట్లరు 15,287 మంది ఉండగా.. పురుషులు 9,638 మంది, మహిళా ఓటర్లు 5,649 మంది ఉన్నారు. గత నెల 23వ తేదీ తరువాత ఆన్‌లైన్ ద్వారా 1,930 దరఖాస్తులు, ఆఫ్‌లైన్ ద్వారా 4,064 దరఖాస్తులు స్వీకరించారు. వీటి పరిశీలన అనంతరం ఈ నెల 30న తుది జాబితా ప్రకటించనున్నారు. ప్రస్తుతం ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఉన్న పాకలపాటి రఘు వర్మ పదవీ కాలం వచ్చే ఏడాది మార్చి 29 నాటితో పూర్తవుతోంది.

కరాటే పోటీల విజేత ఏపీ



విజేతగా నిలిచిన ఏపీ జట్టుతో సినీ నటుడు సుమన్

విశాఖ స్పోర్ట్స్: వైజాగ్ ఓపెన్ కరాటే పోటీలు ఆదివారం పోర్ట్ స్టేడియంలో ముగిశాయి. 46 పాయింట్లతో ఆంధ్రప్రదేశ్ జట్టు తొలి స్థానంలో నిలవగా 33 పాయింట్లతో తెలంగాణ, 26 పాయింట్లతో పశ్చిమబంగా జట్టు వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. వాడోకై కరాటే సంఘం, డ్రాగన్‌ఫోర్స్ అకాడమీల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల ముగింపు కార్యక్రమానికి సినీనటుడు సుమన్ హాజరై విజేతలకు ట్రోఫీలందించారు.

న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వంపై శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి నాగేశ్వరరావు

విశాఖ లీగల్: పలు జిల్లాల న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వంపై శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. 4వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి/ జిల్లా ప్రధాన న్యాయమూర్తి(ఇన్‌చార్జి) ఎం.నాగేశ్వరరావు ఈ శిక్షణను స్థానిక కోర్టుల సముదాయంలో ప్రారంభించారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాల న్యాయమూర్తులకు మధ్యవర్తిత్వంపై నిర్వహించే ఈ శిక్షణ ఈ నెల 20 వరకు కొనసాగుతుందన్నారు. దీన్ని న్యాయమూర్తులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. శిక్షణ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి(తూర్పుగోదావరి, రాజమహేంద్రవరం) గంధం సునీత, ఆంధ్రప్రదేశ్ విలువ ఆధారిత పన్ను అప్పీల్లేట్ ట్రిబ్యునల్(విశాఖపట్నం) చైర్మన్ జి.గోపి, సుప్రీం కోర్టు మధ్యవర్తిత్వం(ఢిల్లీ) శిక్షకులు నగీనా జైన్, సీనా ఖరే, నాలుగు జిల్లాల న్యాయమూర్తులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్టేషన్ నుంచి బైక్ దొంగ పరారీ?

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ నుంచి ఓ యువకుడు పరారైనట్లు తెలిసింది. పదుల సంఖ్య చుట్టూ పోలీసులు ఉన్నప్పటికీ వారి కళ్లుగప్పి తప్పించుకున్నాడు. రెండు రోజుల క్రితం బైక్ దొంగతనం చేసినట్లు గుర్తించిన ఆరిలోవ క్రైం విభాగం పోలీసులు ఓ యువకుడ్ని స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఆ యువకుడు మొదటి అంతస్తులో బాత్‌రూంకు వెళ్లి అందులో వెంటిలేటర్ అద్దాలు పగలుగొట్టి పరారైనట్లు తెలిసింది. దీంతో క్రైం పోలీసులు ఆ యువకుడి గురించి రెండు రోజులుగా గాలిస్తున్నట్లు సమాచారం. పోలీసులు మాత్రం ఈ విషయాన్ని గోప్యంగా ఉంచి బయటకు తెలియకుండా జాగ్రత్తపడుతున్నారు.

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

మర్రిపాలెం: కంచరపాలెం ఐదోపట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రేమ విఫలం కావడంతో ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏఎస్ఆర్‌నగర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్న బాల శేఖర్ (19) ఓ మొబైల్ షాపులో పనిచేస్తున్నాడు. శేఖర్ ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. ప్రేమ విఫలమై సోమవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఘటనా స్థలంలో ప్రేమ లేఖ లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ చంద్రశేఖర్ నేతృత్వంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

22న క్రాస్‌కంట్రీ జట్ల ఎంపిక

విశాఖ స్పోర్ట్స్: జిల్లా క్రాస్ కంట్రీ జట్టును ఈనెల 22వ తేదీన పోర్ట్ స్టేడియంలో ఎంపిక చేయనున్నారు. జిల్లా అథ్లెటిక్ సంఘం ఆధ్వర్యంలో మెన్, వుమెన్‌కు పది కిలోమీటర్ల పరుగు పోటీ నిర్వహించనున్నారు. అండర్ 20 బాలబాలికలకు 8 కిలోమీటర్లు, అండర్ 18 బాలబాలికలకు 6 కిలోమీటర్లు, అండర్ 16 బాల బాలికలకు 2 కిలోమీటర్ల మేర పోటీ నిర్వహించి జట్టును ఎంపిక చేయనున్నట్లు సంఘం కార్యదర్శి నారాయణరావు తెలిపారు.

రేపు ఎస్సీ వర్గీకరణ కమిషన్ బృందం పర్యటన

మహారాణిపేట: భారత అత్యున్నత న్యాయ స్థానం ఆదేశాల మేరకు షెడ్యూల్ ఉపకులాల వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ బృందం బుధవారం జిల్లాలో పర్యటించనుంది. బుధవారం ఉదయం 11 గంటలకు నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులతో కలెక్టరేట్లో సమావేశమవుతారు. అనంతరం ప్రజలు, కుల సంఘాల ప్రతినిధుల నుంచి వినతులు స్వీకరిస్తారని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ సోమవారం తెలిపారు.